# అపరాధము ఎవరిది?

శ్రీ సి. సి. పున్నయ్య

అది ఆహానగరంలో నడిబొడ్డు. అక్కడి కోలాహలము. కాఫీహోటళ్ళు. వెండి బంగారు నగలదుకాణాలు. గుడ్డలకొట్లు వచ్చేపోయేజనసమూహంతో విధీ,విరామము కనుపించడం లేదు. సంపన్నులు మోటారు కార్లలో స్త్రీలు పురుషులు, పిల్లలు వచ్చుదిగి కొట్లల్లోకి దూరుతుండగా పొట్లాలతోటి బయటికి తిరిగి వచ్చేవారు వస్తున్నారు.

పెద్ద కాఫీ హోటలు ముందు ఒక యువతి "బాబూ! అనాథను కానీడబ్బు ధర్మం చేయండి" అని దీనాలాపనలు చేస్తుండేది. సన్నంగా పొడుగ్గా ఏయస్సు యిరవై అయిదుసంవత్సరాలకు లోపువుంటుంది. అపరూపసుందరిలాగ రాణించేది. సాయంకాలము 5 గంటలనుండి రాత్రి 9 గంటల వరకు ఆహోటలు ముందుఉంటుండేది.

ఆమెను "కులట" అంటుంది సంఘము. కాని భర్త సంపన్నుడు. తండ్రి. అన్నదమ్ములూ యున్నారు. వారందరు సంఘములోని పెద్దలు. ఆమె భర్త అప్రయోజకుడు అయోగ్యుడు, అయినంతవరకు తిని శ్వేచ్ఛగాతిరుగుతూ నీతి నియమాల కతీతుడుగా తిరుగుతుంటాడు. ఆయన భార్యతోటి దాంపత్యము కొద్దికాలప్పదైనను ఆమెను కట్టి విడిచిన చొక్కా. ధోవతుల్లాగ చూచేవాడు పైగా మూన్నాళ్ళ ముచ్చటైన దాంపత్యములో అది ఉన్న సంసారమైనా అంటుట్లో కడుపునిండా తిండి. ఒంటినిండా గుడ్డ, నెమ్మదిగల మనస్సు ఆమె ఎరుగదు. ఎప్పుడూ చావుదెబ్బలు.

ఇక తండ్రిని చూద్దామా అంటే డబ్బు సంపాదనే పరమావధిగా మంచి చెడ్డలకు, నీతి నియమాలకు, మానమర్యాదలకు అతీతుడై అయినవాళ్ళ, కానివాళ్ళనోళ్ళలో నానుతుంటాడు. ఇక అన్నతమ్ములు సుందోప సుందులు. తండ్రి పెద్ద చదువులుచదివించి వేలకువేలు వరకట్నాలు గుంజాలని ఎంత తాపత్రయపడినా ఒక్కడైనా ప్రయోజకుడు కాలేదు. తండ్రి హెచ్చులకు పోయి, పరవళ్ళు త్రొక్కి కూతుర్నిచ్చిన చోట విరోధం పెంచుకున్నాడు. ఆమెను జీవిత పర్యంతము పోషించే వాడులాగ యింట తెచ్చి పెట్టుకున్నాడు. అత్తవారికైనా ఆమె లేకపోతే పూటకు అరసోలెడు బియ్యం మిగులుత వనే గాని కొడుకూ కోడలు ముచ్చటగా పిల్లజెల్లాతో కాపురం చేయడానికనువైన వాతావరణము కాని, యోగ్యతలు కాని లేవు. తండ్రైనా కూతుర్ని నయానో భయానో అత్తగారింటికి పంపలేదు. పుట్టింట్లో నయినా అనుకూల పరిస్థితులున్నాయా అంటేఅదీలేదు. తనయింటికైతె కూతుర్ని పిలుచుకొని వచ్చాడు కాని కాల గమనంతో పాటు కష్టాలుఏర్పడినవి. తండ్రి.అన్నదమ్ములు ఎవరికివారుతమ పొట్టలను ఏదో విధంగా నింపుకొని అవసరాలు గడుపుకుంటూంటే తల్లి కూతుళ్ళకు ఒక్కొక్కరోజు అడుగు బొడుగుకూడ మిగిలేదికాదు. ఆమె వారిదృష్టిలో పల్చనైపోయింది.

కాలక్రమాన పుట్టింట్లో పరిస్థితులు తానిక నుండలేనివిగా ఏర్పడినవి. తనకున్న కొద్ది, గొప్ప చదువుతో రెక్కల కష్టమైనా చేసికొని జీవయాత్ర సాగించ గలననే ఆత్మ విశ్వాసంతో గ్రామంవదలి ఆ మహానగరం చేరింది

ఒక పొగాకు కంపెనీలో నౌకరికి కుదిరింది — కాని చేరిన ఆరవరోజున జీతాలు బట్వాడా చేసే గుమస్తా ఆమెను బలవంతం చేయబూనేసరికి చెంపలు వాయించి బయటికి వచ్చింది. తర్వాత ఒక సంపన్న గృహంలో వంటపనికి కుదిరింది—తిండికి జరిగిపోయి. కొద్ది గొప్ప జీతం లభిస్తుంది కదాయని. ఆయింటి యజమాని విద్యావంతుడైనా. అప్సరసలాంటి భార్య. గంపెడు సంతానమున్నా నీచమనస్కుడు కావడంవల్ల అసభ్యంగా వ్యవహరించేసరికి పనిచాలించుకొని బయట పడాల్సి వచ్చింది. తర్వాత సయితము ఎక్కడైనా మాన మర్యాదలతో చాకిరి చేసికొని జీవయాత్ర సాగించాలని శాయశక్తులా ప్రయత్నించింది; ఎక్కడికి పోయినా అవకాశము దొరకలేదు. ఇకమార్గం తోచక మాన మర్యాదల నుద్దేశించి బిక్షాటనమున కుపక్రమించింది. అప్పుడైనా నీతినిజాయితీ

లకు తాపత్రయ పడినంత కాలము పిడికెడు అన్నము పెట్టేవారు కాని,డబ్బిచ్చేవారుకాని అరుదుగా నుండేవారు. ఎంతకాలము ఆకలిమంటలతో ఆ మహా నగరంలో నడి యెండలో నల్లిలాగ మాడగలదు ! అప్పటినుండి ఆమె చిరునవ్వుతోటి, కనుసైగలతోటి ప్రజలనాకర్షించ మొదలు పెట్టింది. అప్పటినుండి కడుపార అన్నము అమర సాగింది. ఆమెనుచూచి పైకి అసహ్యించు కుంటూన్నట్లు నటిస్తూ లోలోపల ఆమెలాలనకు లొట్టలు వేసుకుంటూ మురిసిపోయే అవకాశవాదులు. స్వార్థపరులే అర్ధరాత్రప్పుడు, అపరాత్రప్పుడు నగరం వెలుపలనున్న ఆమె గుడిసెలోకి దూరేవారు. ఆమె కులట అయితే ఆమె కనుసన్నలలో మెదలుతూ గుడిసెలోకిదూరడానికి అవకాశము నకై ఆరాటపడేవారు వ్యభిచారులయినా, వారిని బాహాటంగా అలా అన సాహసించడానికి ఆమెను కులటయని ఆడిపోసుకునేవారికి దమ్ములుండవు.

ఆ పిల్లతోబాటు ఆ హోటలు దగ్గర నలుగురైదుగురు కుంటి. గుడ్డి, ముసలి, ముతక బిచ్చమెత్తేవారు. కాని వారందరికంటె ప్రతిదినం ఆమెదే సంపాదన ఎక్కువ ఎందుకంటారు ! ఆమె సహజ సౌందర్యము, కనుసైగలు చిరునవ్వుల చిందులుచూచి భ్రమించేవారు రూపాయలు అర్ధ రూపాయలు పారేసి, వెనువెంట పోయేవారు పోతుండగా ఒళ్ళమ్ముకొని బ్రతకసాగిందామె.

కొన్ని సంవత్సరాలకు వయసూ ముదిరింది, ఆమె అనారోగ్యానికి బలియయింది. బక్కచిక్కినదేహం నల్ల కప్పేసి పోయినది. సొట్టలుపడిన చెక్కిళ్ళతో, ముడతలపడిన శరీరంతో, అప్పుడూ ఆ హోటలు దగ్గరే దీనాలాపాపనలుచేస్తూ తారట్లాడు తుండేది. ఒకప్పుడు ఆమెను దేవకన్యగా భ్రమించిన వారికి ఆమె దీనాలాపనలు గాని, చాస్తున్న చేతులుగాని వినిపించేవి కావు, కనుపించేవికావు. ఒకప్పుడామె చుట్టూ ఆరాటంతో తిరిగినవారు ఆమె పలుకరిస్తుందేమోనన్న భయంతో దూరమునుండే తొలగి పో సాగారు. యౌవ్వన రూపలావణ్యాలతో.బాటు ఆదాయం తగ్గిపోయేసరికి కూటికి, గుడ్డకు కరువేర్పడింది.

ఆరోజు రాత్రి 10 గంటలదాక హోటలు దగ్గర తారట్లాడినా బేడడబ్బులు దొరకలేదు. ఆకలేమో తారామండలంగా దహించుకొని పోతున్నది. ఇల్లిల్లుతిరిగినా నాలుగు ముద్దలన్నము దొరికితే ఆకలి చల్లార్చుకోవాలని బజారు బజారు తిరిగింది. ఆమె దురదృష్టమా అన్నట్లు పోయిన చోటునల్లా వ్యతిరేక ఫలితాలు తప్ప పిడికెడు అన్నం దొరకలేదు. పైగా తరచుగా కుక్కలు మొరుగుతూ వెంటాడ సాగినవి.

నిస్పృహ నిరాశలతో ఊహాతీతమైన ఆకలి బాధతో కాళ్ళీడ్చుకొంటూ 12 గంటలకు యించుమించుగా నిర్మానుష్యంగా నున్న బజారుకు వచ్చింది. ఒక టీ కొట్టు మాత్రము తెరిచి యుంచబడి గ్యాస్‌లైటు వెలుగుతోంది యజమాని మేజాకెదురుగా కుర్చీలో కునికిపాట్లు పడుతున్నాడు. పనిపాటలు చేసే పిల్లవాడు ప్రొద్దస్తమానము చాకిరి చేసియుండటము వలన ఒళ్ళు తెలియకుండా బయటి బల్లమీద పండుకొని నిద్రపోతున్నాడు ఆ లైటు కాంతిలో మెరుస్తున్న అద్దాల బీరువాలోని రొట్టెలు ఆమె దృష్టి నాకర్షించినవి. కునికి పాట్లు పడుతున్న యజమాని వెనుకగుండా వెళ్ళి నిశ్శబ్దంగా తెరచియున్న బీరువాలో నుండి ఒక రొట్టె తీసికొని జారుకొని పోతూండే సరికి ఎక్కడనుంచి వచ్చిందో ఒక కుక్క — గగ్గోలు పెట్ట సాగింది. చుట్టుపక్కల నున్న నిద్రావస్థలోనున్న వారు లేచి "దొంగ ! దొంగ !" అని వీరినివారు వారినివీరులేపి కర్రలు, కత్తులు తీసికొని ఆమె వెంటబడే సరికి ఆమె అక్కడక్కడ నక్కుతూ తన గుడిసెవైపు పారిపోయింది. చీకటి గాఢాంధకారములో భయాందోళనతో చూపు మసకలు క్రమ్మి నురుగు దబ్బలు పడేలాగ పరుగెడుతూ కాలుజారి మురుగు కాలవ సిమెంటు గట్టుకు తలమోదుకుని బ్రద్దలయి రక్త ప్రవాహ మయింది. "అమ్మా ! అమ్మా !" అనే మూలుగు అనతికాలంలోనే నీరసించి అనంత విశ్వంలో లీనమై పోయింది. అక్కడక్కడ వెదకుతూవచ్చి టార్చిలైటు వెలుగులో రక్తపు మడుగులో రొట్టెతోసహా తేలియాడుతున్న ఆమెను చూచి చచ్చినపామును కొట్టినట్లు చేతనున్న కర్రలతో మోది వీరాధి వీరులులాగ వెళ్ళారు దొంగను పట్టటానికి వచ్చిన వారు. సమీపముననున్న రావిచెట్టుమీది గుడ్లగూబ భయానకంగా కూసింది, ఉరుములు, మెరుపులతో ప్రారంభ మయినగాలి వాన ఆమె రక్తసిక్త మయిన శవమును గంగపాలు చేసింది. ఆమెతో బాటు ప్రళయ వాతావరణములో ఆమె గుడిసెసయితం కూలిపోయింది.

తమ అవసరాలు తీరడంతో మాత్రం తృప్తిపడే అవకాశవాదులకు, స్వార్థపరులకు ఆమె చావు ఏమి నొప్పి కలిగిస్తుంది ! అలాంటి వారిని ఉద్ధరించాలనే విశాల హృదయం, సానుభూతి సంఘంలో ఎంత మందికి ఉంటుంది !